సాక్షి

డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

సోమవారం । 13 । మార్చి । 2023



ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి


ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఈ నెల 15 నుంచి జరిగే ఇంటర్మీడియెట్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తయ్యాయని జోన్-1, 2 రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఐ.శారద తెలిపారు. - 8లో



ఉత్సాహంగా ఎడ్ల పరుగు పందేలు

నువ్వా నేనా అంటూ గెలుపే లక్ష్యంగా గొల్లప్రోలు మండలం కొడవలిలో ఆదివారం రాష్ట్ర స్థాయి ఎడ్ల పరుగు పందేలు ఉత్కంఠ భరింతగా జరిగాయి. - 8లో

డెల్టాలకు 7,160 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు ఆదివారం 7,160 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 2,170, మధ్య డెల్టాకు 1,410, పశ్చిమ డెల్టాకు 3,580 క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 5.55 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

కిక్కిరిసిన అయినవిల్లి ఆలయం



అయినవిల్లి విఘ్నేశ్వర స్వామికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరుని ఆలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. ఆలయ ప్రధానార్చకులు వినాయకరావు ఆధ్వర్యంలో స్వామికి విశేష పూజలు చేశారు. స్వామిని అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి లఘున్యాస అభిషేకాల్లోను, లక్ష్మీగణపతిహోమంలోను అధిక సంఖ్యలో భక్త దంపతులు పాల్గొన్నారు. నూతన వాహనాలకు పూజలు చేశారు. స్వామివారి ప్రత్యేక దర్శనం ద్వారా రూ.18,500, అన్నప్రసాదాలకు వచ్చిన విరాళాలు రూ.64,000, వివిధ సేవల ద్వారా .25,000, ప్రసాదాల విక్రయం ద్వారా రూ. 36,000, వివిధ విరాళాల ద్వారా రూ.5,000 మొత్తం రూ.1,48,500 ఆదాయం లభించిందని ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.

బాలబాలాజీ ఆదాయం రూ.1.38 లక్షలు

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీ బాలబాలాజీ స్వామివారికి ఆదివారం లడ్డు ప్రసాదం, దర్శన టికెట్ల విక్రయాలు, అన్నదాన ట్రస్టుకు రూ.1,38,694 ఆదాయం వచ్చినట్లు ఆలయ చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, ఎంకేటీఎస్ వర ప్రసాద్ తెలిపారు. స్వామి వారి దర్శనం టికెట్లు, లడ్డూ విక్రయాల ద్వారా రూ.90,240ల, నిత్య అన్నదాన ట్రస్టుకు రూ.48,454 ఆదాయం వచ్చిందన్నారు. స్వామి వారిని 1,693 మంది దర్శించుకుని 1,158 మంది అన్నప్రసాదం స్వీకరించారు. ఆలయ చైర్మన్, కార్యనిర్వహణాధికారి, ధర్మకర్తల మండలి సభ్యుల పర్యవేక్షణలో భక్తులకు కావలసిన ఏర్పాట్లను సమీక్షించారు.



ఘనంగా వైఎస్సార్ సీపీ ఆవిర్భావ వేడుకలు

ఆనందం ఉట్టిపడేలా...

అట్టహాసంగా



అల్లవరం గుడ్డివానిచింత సెంటర్లో కేక్ కట్ చేస్తున్న ఎంపీ అనురాధ



రామచంద్రపురంలో జరిగిన పార్టీ ఆవిర్భావ సభలో కేక్ కట్ చేస్తున్న మంత్రి చెల్లుబోయిన వేణు

సాక్షి అమలాపురం: వైఎస్సార్ సీపీ ఆవిర్భావ వేడుకలు జిల్లావ్యాప్తంగా అట్టహాసంగా జరిగాయి. పార్టీ ఏర్పడి 12 వసంతాలు పూర్తి చేసుకుని 13వ వసంతంలో అడుగు పెడుతున్న సందర్భంగా ఆదివారం జిల్లావ్యాప్తంగా పార్టీ ఆవిర్భావ వేడుకలు కోలహలంగా నిర్వహించారు. ఆ పార్టీకి చెందిన ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నేతలు కేక్‌కట్ చేసి కార్యకర్తలకు పంచారు. పార్టీ జెండాను ఎగురవేసి దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డికి నివాళులర్పించారు. పేదలకు వస్త్రాలు పంపిణీ చేయడంతోపాటు, రోగులకు పాలు, పండ్లు అందజేశారు.

- రామచంద్రపురంలో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణు గోపాలకృష్ణ ఆధ్వర్యంలో పార్టీ ఆవిర్భావ వేడుకలు ఘనంగా జరిగాయి. మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న దివంగత మహానేత డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు.
- కొత్తపేట నియోజకవర్గంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కొత్తపేట పాత బస్టాండ్ సెంటర్, రావుల పాలెం పార్టీ కార్యాలయం వద్ద జరిగిన వేడుకల్లో మహానేత వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పార్టీ పతాకాలను ఆవిష్కరించారు. ఆస్పత్రిలో రోగులకు, గర్భిణులు, బాలింతలకు పాలు, పండ్లు, రొట్టెలు, పోషకాహార కిట్లు పంపిణీ చేశారు.



ముమ్మిడివరంలో దివంగత సీఎం రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే సతీష్‌కుమార్ తదితరులు

- ముమ్మిడివరంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే పొన్నాడ సతీష్ కుమార్ ఆధ్వర్యంలో పార్టీ ఆవిర్భావ వేడుకలు స్థానిక పోలమ్మ చెరువు గట్టు వద్ద ఘనంగా జరిగాయి. పార్టీ జెండా ఆవిష్కరించిన ఎమ్మెల్యే సతీష్ వైఎస్సార్ విగ్రహానికి నివాళులు అర్పించారు.
- మండపేట రాజారత్నం సెంటరులో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పార్టీ జెండాను ఆవిష్కరించారు. కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచారు. వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.
- అమలాపురం నియోజకవర్గ పరిధిలో అల్లవరం మండలం గుడ్డివానిచింత వద్ద జరిగిన వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో అమలాపురం ఎంపీ చింతా అనూరాధ పార్టీ జెండాను ఆవిష్కరించారు. మంత్రి పినిపే విశ్వరూప్ తనయుడు పినిపే శ్రీకాంత్, ఎమ్మెల్సీ అభ్యర్థి బొమ్మి ఇజ్రాయిల్ పాల్గొన్నారు.
- అమలాపురం పట్టణంలో జరిగిన వేడుకల్లో పేదలకు చీరలు పంపిణీ చేశారు. వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులు అర్పించారు. డాక్టర్ పినిపే శ్రీకాంత్, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు పాల్గొన్నారు.
- పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ఆధ్వర్యంలో పి.గన్నవరం సెంటరులో పార్టీ జెండాను ఆవిష్కరించి, వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మొగలికుదురులో ఉన్న అనాథ ఆశ్రమంలో ఉన్నవారికి పాలు, పండ్లు పంపిణీ చేశారు.

నేడు యథావిధిగా స్పందన

అమలాపురం రూరల్: జిల్లా, డివిజన్ మండల, గ్రామ స్థాయిలలో స్పందన కార్యక్రమాలు సోమవారం యథావిధిగా జరుగుతాయని అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో స్పందన హాలులోజిల్లా స్థాయిలోను, డివిజన్, మండల కార్యాలయాల్లో, గ్రామ, వార్డు సచివాలయాలలో అర్జీదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తారని ఆయన తెలిపారు. అధికారులు అందరూ ఉదయం 10 గంటల నుంచే ఫిర్యాదులను స్వీకరిస్తారని గ్రామ వార్డు సచివాలయాల్లో మాత్రం మధ్యాహ్నం మూడు నుంచి సాయంత్రం ఐదు గంటల మధ్య విజ్ఞాపనలు స్వీకరిస్తారని కలెక్టర్ తెలిపారు.

రత్నగిరి చేరిన కంచి పీఠాధిపతి

అన్నవరం: కంచి కామకోటి పీఠాధిపతి జగద్గురు శంకర విజయేంద్ర సరస్వతి మహాస్వామి ఆదివారం రాత్రి రత్నగిరికి చేరుకున్నారు. ఆయనకు రత్నగిరి టోల్‌గేట్ వద్ద దేవస్థానం ఇన్‌చార్జి ఈఓ చంద్రశేఖర్ అజాద్, వేద పండితులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. సోమవారం ఉదయం స్వామీజీ సత్యదేవుని దర్శించి, ప్రత్యేక పూజలు చేస్తారు. స్వామీజీ ఈ నెల 18 వరకూ దేవస్థానంలో బస చేస్తారు. పీఠం సంప్రదాయాన్ని అనుసరించి కొండ దిగువన పంపా సత్రంలో ప్రతి రోజూ ఉదయం చంద్రమౌళీశ్వరునికి అభిషేకాలు, మహాత్రిపురసుందరి అమ్మవారికి పూజలు, మధ్యాహ్నం చంద్రమౌళీశ్వరార్చన నిర్వహిస్తారు. పూజల అనంతరం భక్తులకు స్వామీజీ దర్శనమిస్తారు.

రైల్వే స్టేషన్‌లో త్వరలో 6వ నంబర్ ప్లాట్‌ఫాం

ఎంపీ మార్గాని భరత్‌రామ్

రాజమహేంద్రవరం రూరల్: నగరంలోని ప్రధాన రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు దక్షిణ మధ్య రైల్వే సన్నాహాలు చేస్తోంది. వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ ఆదివారం మీడియాకు ఈ విషయం తెలిపారు. ప్రస్తుతం 4, 5 ప్లాట్‌ఫాంల పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. రానున్న మరో రెండు వారాల్లో తూర్పు రైల్వే స్టేషను వైపు ఆరో నంబర్ ప్లాట్‌ఫాం కూడా రాబోతోందని చెప్పా రు. గౌతమీ, గోదావరి వంటి ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఈ ప్లాట్‌ఫాం పైకి వచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు.

మహిళలకు అథ్లెటిక్స్‌లో పోటీలు



పరుగు పోటీల్లో పాల్గొన్న మహిళలు

అమలాపురం రూరల్: విజయవాడ ఏపీ క్రీడాప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు కోనసీమ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో అమలాపురం ఎస్‌కేబీఆర్ కళాశాలలో అథ్లెటిక్ క్రీడా ప్రాంగణంలో మహిళలకు క్రీడా పోటీలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈ నెల 10 నుంచి 25వ తేదీ వరకు జరిగే వివిధ క్రీడా పోటీల్లో భాగంగా 100 మీటర్లు, 1600 మీటర్లు లాంగ్ జంప్ ఈవెంట్లల్లో పోటీలు నిర్వహించారు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ముఖ్య శిక్షకులు సురేష్‌కుమార్ మాట్లాడుతూ మహిళల్లో క్రీడా స్ఫూర్తిని పెంచేందుకు ఈ పోటీలు నిర్వహించామన్నారు. కళాశాల పీడీ కేవీఎస్ ప్రసాద్, బాస్కెట్‌బాల్ శిక్షకులు భీమేష్, అథ్లెటిక్ శిక్షకులు ఐ.సురేష్, రెజ్లింగ్ శిక్షకురాలు కనకదుర్గ, టైక్వాండో శిక్షకులు సత్యనారాయణ కార్యాలయ ఉద్యోగి కామేష్ పాల్గొన్నారు.

కోటసత్తెమ్మ తల్లికి రూ.1.81 లక్షల ఆదాయం

నిడదవోలు రూరల్: తిమ్మరాజుపాలెంలో వేంచేసియున్న కోటసత్తెమ్మ అమ్మవారిని ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారికి వివిధ రూపాల్లో రూ.1,80,882 ఆదాయం సమకూరింది. దేవస్థానం ఆధ్వర్యాన అమ్మవారికి ప్రత్యేకంగా పుష్పాలంకరణ చేసి, పూజలు నిర్వహించామని ఈఓ బళ్ల నీలకంఠం (శివ) తెలిపారు. భక్తులకు పులిహోర ప్రసాదం పంపిణీ చేశారు. భక్తుల ఏర్పాట్లను ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ దేవులపల్లి రామసుబ్బరాయశాస్త్రి, ధర్మకర్తల మండలి సభ్యులు, సిబ్బంది పర్యవేక్షించారు.

సమాజ హితాన్ని కాంక్షించేదే కవిత్వం

అమలాపురంలో జాతీయ శతాధిక ఉగాది కవి సమ్మేళనం

అమలాపురం టౌన్: సమాజ హితాన్ని కాంక్షిస్తూ రాసేదే కవిత్వం అని కవులు తమ కవితా గానాలతో స్పష్టం చేశారు. అమలాపురంలోని సర్ సీవీ రామన్ స్కూలులో ఆదివారం జరిగిన జాతీయ శతాధిక ఉగాది కవి సమ్మేళనం రంజింపచేసింది. జిల్లా శ్రీశ్రీ కళావేదిక, కోనసీమ రచయితల సంఘం సయుంక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కవితా సమ్మేళనం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా, కర్ణాటక రాష్ట్రాల నుంచి హాజరైన 140 మంది కవులు, కవయిత్రుల చేసిన కవితా గానాలతో సాగింది. శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్, ప్రభుత్వ గుర్రం జాషువా పురస్కార గ్రహీత డాక్టర్ కత్తిమండ ప్రతాప్ అధ్యక్షతన ఈ జాతీయ కవి సమ్మేళనం జరిగింది. సామాజిక చైతన్యంతో కవిత్వం రాసినప్పుడు ఆ భావాలు సమాజ ప్రగతికి తోడ్పతాయని డాక్టర్ ప్రతాప్ అన్నారు. సమ్మేళనంలో ఎక్కువ మంది కవులు తెలుగు భాషా విశిష్టతను విశ్లేషిస్తూనే ఉగాది వైభవాన్ని తమ కవితలతో చాటారు. మరికొంత మంది కోనసీమ అందాలను అభివర్ణించారు. శ్రీశ్రీ కళావేదిక జిల్లా అధ్యక్షుడు, కవి నల్లా నరసింహమూర్తి, కోనసీమ రచయితల సంఘం అధ్యక్షుడు, కవి బీవీవీ సత్యనారాయణ, ఆ సంఘం గౌరవాధ్యక్షుడు, అమలాపురం మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, వేదిక ప్రతినిధి, సర్ సీవీ రామన్ స్కూలు డైరెక్టర్ రవణం వేణుగోపాలరావు ఈ కవి సమ్మేళనాన్ని పర్యవేక్షించారు. డాక్టర్ కత్తిమండ ప్రతాప్, స్కూలు డైరెక్టర్ వేణుగోపాలరావును కవులు సత్కరించారు.



డాక్టర్ ప్రతాప్‌ను సత్కరిస్తున్న కవులు

సమ్మేళనాలతోనే కవితా వైభవం



ఇలాంటి జాతీయ కవి సమ్మేళనాలతో కవులు రాసే కవితలకు, వారి వినిపించే కవితా గానాలకు ఓ వైభవం చేకూరుతుంది. అలాంటి వైభవాన్ని కవులకు శ్రీశ్రీ కళావేదిక అనేక రూపాల్లో అందిస్తోంది. ఇప్పటి వరకూ నేను 12 జాతీయ కవితా సమ్మేళనాల్లో పాల్గొన్నాను. కవిత్వంపై నాకున్న అపారమైన జిజ్ఞాసతోనే ఒడిశా నుంచి వచ్చాను.

– బొమ్మాడ నరసింహరావు, కవి, గుణుపూర్, ఒడిశా రాష్ట్రం

ఇది నాకు 21వ కవి సమ్మేళనం



ఇప్పటి వరకూ 20 జాతీయ కవి సమ్మేళనాల్లో పాల్గొన్నాను. శ్రీశ్రీ కళా వేదిక ఎప్పుడు జాతీయ కవి సమ్మేళనం నిర్వహించినా సామాజిక చైతన్యాన్ని నింపేదిగా ఉంటుంది. ఇప్పుడు ఉగాది అంశంపై నిర్వహించడంతో ఆ పర్వ దిన విశిష్టతపై కవితను వినిపించాను.

– చిట్టే లలిత, కవయిత్రి, భద్రాచలం, తెలంగాణ రాష్ట్రం

కవితకు ప్రేరణ ఇచ్చిన కోనసీమ



నాది అనంతపురం జిల్లా. పచ్చని అందాలపై కవితను రాసే ప్రేరణ నాకు ఈ కోనసీమ కల్పించింది. ఇలాంటి కవి సమ్మేళనాలతో కవుల మధ్య కవిత్వ అనుబంధాలు పెరగడం తోపాటు తెలుగు భాష విశిష్టతను పెంపొందిస్తాయి. ఇప్పటి వరకూ నేను 40 జాతీయ కవితా సమ్మేళనాల్లో పాల్గొన్నాను.

– గుత్తా హరి సర్వోత్తమ నాయుడు, కవి, అనంతపురం

ఇది 116వ జాతీయ కవి సమ్మేళనం



శ్రీశ్రీ కళావేదిక ఇప్పటి వరకూ 116 జాతీయ కవి సమ్మేళనాలను నిర్వహించింది. అందులో ఎక్కువ శతాధిక కవి సమ్మేళనాలే. ఇప్పుడు ఉగాది పేరుతో అమలాపురంలో నిర్వహించిన సమ్మేళనానికి కవుల నుంచి మంచి స్పందన వచ్చింది.

– డాక్టర్ కత్తిమండ ప్రతాప్, అంతర్జాతీయ చైర్మన్, శ్రీశ్రీ కళా వేదిక

డ్రైనేజీకి మంగళం

- ఎట్టకేలకు ఈఈ కార్యాలయం తరలింపు
- కాకినాడ నుంచి అమలాపురానికి మార్పు
- సుదీర్ఘకాలంగా రైతుల కల
- సీఎం జగన్ ఆదేశంతో సాకారం

సాక్షి అమలాపురం: గోదావరి డెల్టా రైతుల చిరకాల వాంఛ నెరవేరబోతోంది. మధ్యడెల్టా ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ కార్యాలయాన్ని... డ్రెయిన్స్ ఎగ్జిక్యూటివ్ కార్యాలయాన్ని కోనసీమ కేంద్రమైన అమలాపురంలో ఏర్పాటు చేయాలని ఈ ప్రాంత రైతులు దశాబ్దాలుగా కోరుతున్నారు. జిల్లా ఏర్పాటు చేయక ముందే ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరింగ్ కార్యాలయాన్ని ధవళేశ్వరం నుంచి అమలాపురం మార్చిన వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం.. తాజాగా కాకినాడలో ఉన్న డ్రెయిన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయాన్ని అమలాపురం తరలించాలని నిర్ణయించింది. దీనిపై ఈ ప్రాంత రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గోదావరి డెల్టాలో కీలకమైంది డ్రైనేజీ విభాగం. ఉమ్మడి జిల్లాలో కాకినాడ ఈఈ కార్యాలయం పరిధిలో నాలుగు సబ్ డివిజన్ల ఉన్నాయి. జిల్లాల విభజన తరువాత కాకినాడ జిల్లా పరిధిలో కేవలం కాకినాడ సబ్ డివిజన్ మాత్రమే ఉండగా, డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలో అమలాపురం, రాజోలు, రామచంద్రపురం సబ్ డివిజన్లు ఉన్నాయి.

ఉమ్మడి జిల్లా పరిధిలో డ్రెయిన్ల సంఖ్య... విస్తీర్ణం ఇలా..

సబ్ డివిజన్	మేజర్ డ్రెయిన్ల సంఖ్య	పొడవు (కిమీలు)	మీడియం డ్రెయిన్ల సంఖ్య	పొడవు (కిమీలు)	మైనర్ డ్రెయిన్ల సంఖ్య	పొడవు (కిమీలు)
అమలాపురం	9	141.424	11	82.870	101	257.324
రాజోలు	2	46.315	10	99.434	43	162.159
ఆర్‌సీ పురం	4	67.375	5	42.725	46	130.458
కాకినాడ	1	25.38	4	418.69	11	22.44
మొత్తం	16	280.494	30	643.719	201	572.381

– ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలో డ్రైనేజీ శాఖ పరిధిలో మొత్తం 247 మైనర్, మీడియం, మేజర్ డ్రెయిన్లు ఉన్నాయి. వీటి నిడివి 1,496.594 కిలోమీటర్లు. దీనిలో కాకినాడ జిల్లా కాకినాడ డివిజన్ పరిధిలో 16 డ్రెయిన్లు ఉండగా, వీటి నిడివి కేవలం 461.51 కిలోమీటర్లు మాత్రమే. అదే కోనసీమ జిల్లాలోని అమలాపురం, రాజోలు, రామచంద్రపరం సబ్ డివిజన్ల పరిధిలో 231 డ్రెయిన్లు ఉండగా, వీటి పొడవు 1,035.08 కిలోమీటర్లు ఉంది.

–ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఉన్న డ్రెయిన్స్‌లో మూడొంతులు కోనసీమ పరిధిలోనే ఉన్నాయి. ఈ కారణంగా జిల్లా విభజన కన్నా ముందే ఇక్కడకు ఈఈ కార్యాలయాన్ని తరలించాలని స్థానిక రైతులు డిమాండ్ చేస్తూ వస్తున్నారు. 2011 ఈ ప్రాంత రైతులు చేపట్టిన 'సాగుసమ్మె' సమయంలో ఈ డిమాండ్ మరింత పెరిగింది.



మూడేళ్ల క్రితమే అమలాపురం వచ్చిన ఇరిగేషన్ ఈఈ కార్యాలయం



ప్రస్తుతం అమలాపురంలో ఉన్న డ్రెయిన్స్ డీఈఈ కార్యాలయం

ఇరిగేషన్ ఈఈ కార్యాలయం మార్పు చేసింది కూడా సీఎం జగనే

కొత్త జిల్లా ఏర్పడటానికి రెండేళ్ల ముందే మధ్యడెల్టా ఇరిగేషన్ కార్యాలయం ధవళేశ్వరం నుంచి అమలాపురం వచ్చింది. దశాబ్దాలుగా రైతులు కోరుతూ ఉన్నా ఈ కార్యాలయం అమలాపురం రావడానికి ఏర్పడిన అవరోధాలు అన్నీఇన్నీ కావు. అమలాపురం మండలం రంగాపురం ఇరిగేషన్ అతిథిగృహం వద్ద ఉన్న స్థలంలో రూ.73 లక్షలతో నూతన భవనాన్ని నిర్మించినా అధికారులు రాలేదు. దీనిపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేయగా విషయం ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి వెళ్లింది. ఉద్యోగుల తీరుపై సీఎం సీరియస్ అవడంతో రెండేళ్ల క్రితం తప్పనిసరి పరిస్థితుల్లో అధికారులు, సిబ్బంది వచ్చారు.

కార్యాలయం స్థానికంగా రావడంతో రైతులు సమస్యలు లేవనెత్తడమే తరువాయి ఇరిగేషన్ అధికారులు ఆగమేఘాలపై స్పందిస్తున్నారు. పంట కాలువలు, మురుగునీటి కాలువల్లో పూడిక తీత.. గుర్రపుడెక్క.. తూడు తొలగింపు వంటి పనులకు శ్రీకారం చుడుతున్నారు. స్థానికంగా జిల్లా ఇరిగేషన్ అధికారి ఉండడం.. ఉన్నతాధికారుల పర్యవేక్షణ... క్షేత్రస్థాయి పరిశీలనలు... అంచనాలు రూపొందించడం... చకచకా సాగిపోతున్నాయి. వీటన్నింటికీ కారణం మధ్యడెల్టా ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ కార్యాలయం అమలాపురం రావడమే. తాజాగా డ్రెయిన్స్ ఈఈ కార్యాలయం కూడా వస్తే తమ సమస్యలు మరింత వేగంగా పరిష్కారమవుతాయని కోనసీమ రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

చెప్పగానే... సీఎం జగన్ అంగీకరించారు



డెల్టాలో 80 శాతం డ్రెయిన్స్ మన జిల్లా పరిధిలోనే ఉన్నాయి. ఇక్కడే ఈఈ కార్యాలయం ఉంటేనే పనులు వేగంగా సాగుతాయి. కోనసీమలో ఈ కార్యాలయం ఉండాల్సిన అవశ్యకతను సీఎం జగన్ దృష్టికి తీసుకుని వెళ్లగా ఆయన వేగంగా స్పందించారు. కార్యాలయం తరలించే ఏర్పాట్లు చేయాల్సిందిగా అధికారులను ఆదేశించారు. జిల్లా పరిధిలో సాగుకు అవరోధంగా మారిన డ్రెయిన్స్‌ను సీఎస్‌ఆర్, ఇతర నిధులతో ఆధునీకరించే పనులు జరుగుతున్నాయి.

– చింతా అనురాధ, పార్లమెంట్ సభ్యురాలు, అమలాపురం

క్లుప్తంగా

ప్రమాదవశాత్తూ మహిళ మృతి

రౌతులపూడి: మండలంలోని మల్లంపేటకు వెళ్లే రహదారి సమీపంలో ఏలేరు కాలువలో రౌతులపూడికి చెందిన పోలుపర్తి రాజమ్మ(55) ఆదివారం ప్రమాదవశాత్తూ జారి పడి మృతిచెందింది. గేదెలను మేపుకుంటూ నీరు కోసమని ఏలేరు కాలువలోకి దిగి జారిపడిందని కుటుంబ సభ్యులు తెలిపారని కోటనందూరు ఎస్‌ఐ ఎస్.స్వామినాయుడు తెలిపారు. మృతురాలికి భర్త నాగన్నదొర, ఒక కుమారుడు ఉన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన అన్నారు. మృతదేహాన్ని తుని ఏరియా ఆసుపత్రికి తరలించామన్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి



మహాలక్ష్మి (ఫైల్)

మామిడికుదురు: మామిడికుదురుకు చెందిన శతాధిక వృద్ధురాలు వాసంశెట్టి మహాలక్ష్మి (101) ఆదివారం మృతిచెందారు. మహాలక్ష్మి అయిదుగురు కుమారులు, ఐదుగురు కుమార్తెలు ఉన్నారని బంధువులు తెలిపారు. ఐదు తరాలకు చెందిన 11 మంది మనుమలు 15 మంది మనుమరాళ్లు 27 మంది ముని మనవలు 24 మంది మునిమనవరాళ్లు ఉన్నారు. ఆమె మృతి పట్ల గ్రామంలో పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

యాజమాన్య పద్ధతులతో కోకోలో లాభాలు

అంబాజీపేట: యాజమాన్య పద్ధతులు పాటిస్తే కోకో పంట లాభాలు తెచ్చిపెడుతుంది. కోకో (థియోబ్రోమా కోకోవా) మాల్వేసి కుటుంబానికి చెందినది. దీనికిగల ప్రత్యేకమైన రుచి, సువాసన, ఔషధ గుణాల వలన దీనిని దేవతల ఆహారంగా పిలుస్తారు. ఉభయ గోదావరి జిల్లాల కొబ్బరి తోటల్లో కోకోను అత్యంత లాభదాయకమైన అంతర పంటగా గుర్తించారు. వేసవిలో నీటి ఎద్దడి లేకుండా యాజమాన్య పద్ధతులు పాటిస్తే దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన కేంద్రం అధిపతి డాక్టర్ బి.శ్రీనివాసులు, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎన్.బి.వి.చలపతిరావు రైతులకు సూచించారు.

బెరడు తొలుచు పురుగు

కోకో పంటలో బెరడు తొలుచు పురుగు తీవ్ర స్థాయిలో ఉండటాన్ని గుర్తించారు. తల్లి పురుగులు ఏప్రిల్, మే, జూలై నెలలో కోశస్థ దశ నుంచి బయటకు వచ్చి బెరడు వదులుగా ఉన్న ప్రదేశాలలో గుడ్లు పెడతాయి. పగటి పూట కాండంలో ఉంటూ రాత్రి సమయంలో గొంగళి పురుగులు విసర్జించిన పదార్థాలతో తయారైన గొట్టం ఆకారంలో ఉన్న దారి ద్వారా బయటకు వచ్చి బెరడును తింటాయి. ఈ పురుగు ఆశించడం వల్ల బెరుడు కోల్పోయి, పుష్పాలు రాక పిందెలు ఏర్పడవు. విసర్జించిన పదార్థాలతో నిండిన దారిని శుభ్రపరచాలి. పురుగు ప్రవేశించిన రంధ్రాలలో లామిడాసైల్‌త్రిన్ 0.5 మిలీలీటర్లు లేదా క్లొరంట్రనిపోల్ 18.5 ఎస్.సి.0.3 మిల్లీలీటర్ల నీటికి కలిపిన ద్రాణం ఆ రంధ్రాలలోకి పంపించి మట్టితో పూడ్చాలి.

ఎలుకలు, ఉడతలు

ఇవి రెండూ కాయలను అధికంగా నష్టపరుస్తాయి. ఎలుకలు ఎక్కువగా కాయల తొడిమ దగ్గర తిని రంధ్రాలు చేస్తాయి. ఉడతలు పక్వానికి వచ్చిన కాయ మధ్య భాగంలో తిని రంధ్రాలు చేసి లోపల గుజ్జును తిని నష్టపరుస్తాయి. ఎలుకలను నివారించడానికి 10 గ్రాముల బ్రొమోడయాలిన్ కేకరులను (0.05శాతం) కోకో చెట్టు కొమ్మలలో 10–12 రోజుల వ్యవధిలో రెండు సార్లు ఉంచాలి. వైర్‌మెష్ బోనులతో కొబ్బరి ముక్కలను ఎరగా వాడి ఉడతలను పట్టుకొని పక్వానికి వచ్చిన కోకో పంట నష్టాన్ని నివారించవచ్చు.



పాడి-పంట

గజ్జి తెగులు సోకిన కోకో చెట్టు

బొట్రియో డిప్లొడియా కాయకుళ్లు/చార్‌కోల్

ఈ తెగులు పొడి వాతావరణంలో తరచుగా ఆశిస్తుంది. కాయలపై లేతపసుపు రంగోలు మచ్చలు ఏర్పడి, పెరిగి పెద్దవై చాకెలేట్ గోధుమ రంగులోకి మారతాయి. ఈ తెగులు కాడదగ్గర మొదలై కాయ కొన భాగానికి పాకుతుంది. కొన్ని సందర్భాల్లో కాయ అంతా నల్లగా మారి శిలీంధ్ర బీజాలపై జిగురు వంటి పొరను ఏర్పరుస్తుంది. తెగులు సోకిన కాయలు రూపం మారి, మొక్కపై అతుక్కొని ఉంటాయి. లేత కొమ్మలపై ఈ తెగులు ఆశించి తల మాడు తెగులును కలిగిస్తుంది. గామాలపై ఆశించే శిలీంధ్రం కావడం వల్ల ఒక శాతం బోర్డో మిశ్రమం, క్రిమి సంహారక రసాయనంతో కలిపి పిచికారీ చేయాలి.

గజ్జి తెగులు

గజ్జి తెగులును స్టెమ్ కాంకర్ అని కూడా అంటారు. ఈ తెగులు ప్రధాన కాండం మీద, జార్కెట్, ఫాన్ కొమ్మల మీద కనిపిస్తుంది. ముందుగా కాండం మీద నీటితో తడిసినట్టుండే మచ్చలు ఏర్పడి ఆ మచ్చల నుంచి ఎర్ర గోధుమ వర్ణపు జిగటకారి తరువాత ఆ పదార్థం ఎండిపోయి తుప్పులా కనిపిస్తుంది. తోటలో మురుగునీరు పోయే సౌకర్యం కల్పించాలి. తెగులు సోకిన కాయలన్నింటిని తొలగించి, కాల్చివేయాలి. తెగులు సోకిన కణజాలం, బెరడును గీకి వేసి ఒక శాతం బోర్డు పేస్టును పూతలా పూయాలి. తెగులు ఉధృతి అధకంగా ఉంటే కాపర్ ఆక్సిక్లోరైడ్ 3 మిల్లీలీటర్ల నీటిలో కలిపి ప్రతీ చెట్టు పళ్లెంలోని మట్టిలో కలపాలి.

ఎరువుల యాజమాన్యం



కోకో మొక్కలకు ఎరువులు అందించడం వలన మొక్కలు ధృఢంగా పెరిగి మంచి దిగుబడిని అందించడానికి తోడ్పడుతుంది. సాధారణంగా నాటిన 3 సంవత్సరాల నుంచి ప్రతి చెట్టుకు 125 గ్రాముల నత్రజని (250 గ్రా. యూరియా), 40 గ్రాముల భాస్వరం (250 గ్రా. సింగిల్ సూపర్ ఫాస్ఫేట్), 140 గ్రాములు పొటాషియం (250 గ్రా. మ్యూరేట్ ఆఫ్ పొటాష్) సిఫారసు చేస్తారు. నాటిన మొదటి ఏడాది పైన వివరించిన మోతాదులో 33 శాతం, రెండో ఏడాది 66 శాతం వేయాలి. ఈ రసాయనిక ఎరువులను కలిపి చెట్టు మొదలు నుంచి 75 సెంటీమీటర్ల దూరం వరకు చుట్టూ చల్లి మట్టితో కలియబెట్టాలి. జింకు లోపాన్ని నివారించడానికి జింకు సల్ఫేటు (0.3 శాతం) + సున్నం (0.15 శాతం) మిశ్రమం ఆకుల మీద పిచికారీ చేయాలి. ఇనుము ధాతు లోపాన్ని నివారించడానికి ఆకుల మీద అన్నభేది (1 శాతం), నిమ్మ ఉప్పు (1 గ్రా. / లీ.) ని పిచికారీ చేయడం వలన ఈ ధాతు లోపాన్ని నివారించవచ్చు.

– డాక్టర్ బి.శ్రీనివాసులు, అధిపతి, ఉద్యాన పరిశోధన కేంద్రం, అంబాజీపేట

వేడి ప్రసాదం తొట్టిలో పడిన ప్యాకర్

- రత్నగిరిపై సత్యదేవుని ప్రసాదం తయారీ విభాగంలో ఘటన
- విశ్రాంతి తీసుకుంటే సరిపోతుందన్న వైద్యులు



గాయపడిన ప్యాకర్ సత్యనారాయణ

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని ప్రసాదం తయారీ విభాగంలో ఆదివారం ఉదయం జరిగిన ప్రమాదంలో ప్రసాదం ప్యాకర్‌కు స్వల్పగాయాలయ్యాయి. స్వామివారి ప్రసాదం తయారు అయిన తరువాత దానిని కళాయి నుంచి తొట్టిలోకి ఒంపే ప్రయత్నంలో ప్రసాదం ప్యాకర్ పోల్నాటి సత్యనారాయణ కాలు జారి ఆ తొట్టిలో పడిపోయాడు. వెంటనే పక్కనున్న ఇతర ప్యాకర్లు అతనిని పైకి లేపారు. అప్పటికే కుడిచెయ్యి భుజం వరకు వేడి ప్రసాదం తగిలి గాయాలయ్యాయి. వెంటనే అతడిని కాకినాడలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అక్కడ వైద్యం చేసి ఇంటికి పంపించేశారు. మందులు వాడుతూ ఇంటి వద్ద పది రోజులు విశ్రాంతి తీసుకుంటే సరిపోతుందని వైద్యులు తెలిపారని సంబంధిత విభాగ అధికారులు తెలిపారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

- ఉమ్మడి జిల్లాలో 150 కేంద్రాలు
- నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు
- ఆర్జేడీ శారద ఆదేశాలు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా (కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ, ఏఎస్ఆర్)లో ఈ నెల 15 నుంచి జరిగే ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తయ్యాయని ఇంటర్ విద్య జోన్ 1,2 రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఐ.శారద తెలిపారు. ఇంటర్ పరీక్షల నిర్వహణపై ఆర్ఐవోలు, వృత్తివిద్యాశాఖాధికారులు, చీఫ్ సూపరింటెండెంట్‌లు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, కస్టోడియన్లతో ఆదివారం సమావేశం ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ పరీక్షల్లో అధికారులు, సిబ్బంది అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉమ్మడి జిల్లాలో 140 కేంద్రాల్లో ఈ పరీక్షలు వచ్చే నెల నాలుగో తేదీ వరకు జరుగుతాయన్నారు. తూర్పు గోదావరి జిల్లాలో 47 కేంద్రాల్లో 26,931 మంది కాకినాడ జిల్లాలో 60 కేంద్రాల్లో 41,817 మంది, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 38 కేంద్రాల్లో 28,973 మంది, ఏఎస్ఆర్ జిల్లాలో 10 కేంద్రాల్లో 4,922 మంది మొత్తం ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో 1,02,643 మంది ఈ పరీక్షలకు హాజరవుతారన్నారు. 140 కేంద్రాలకు సీఎస్, డీఎస్‌ల నియామకం పూర్తయిందన్నారు. ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని, ఒక నిమిషం ఆలస్యమైనా లోపలికి అనుమతి లేదన్నారు. ఉమ్మడి జిల్లాలో ఏడు ఫ్లయింగ్ స్క్వాడ్స్, 10 సిట్టింగ్ స్క్వాడ్‌లను నియమించామన్నారు. విద్యార్థులు పరీక్షకు గంట ముందుగా కేంద్రానికి చేరుకోవాలన్నారు.



మాట్లాడుతున్న రీజినల్ జాయింట్ డైరెక్టర్ శారద

హాల్ టిక్కెట్ ఇవ్వకపోతే కళాశాలపై చర్యలు

ఇంటర్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు అన్ని కళాశాలల యాజమాన్యాలు హాల్ టికెట్లు ఇవ్వాలన్నారు. ఫీజు సాకు చెబుతూ ఇబ్బందులకు గురిచేసినట్లు తమ దృష్టికి వస్తే ఆ కళాశాలపై చర్యలు తీసుకుంటామన్నారు. పరీక్షలు సీసీ కెమెరాల పర్యవేక్షణలో జరుగుతాయన్నారు. కార్యక్రమంలో ఆర్ఐవో ఎస్ఎస్ఎల్‌వీ నరసింహం, డీవీఈవోలు, హెచ్‌పీసీ, డీఈసీ మెంబర్లు పాల్గొన్నారు.

బరువులెత్తారు... పతకాలు పట్టారు

- అమలాపురంలో ముగిసిన రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలు

అమలాపురం టౌన్: అమలాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సభా వేదికపై జరుగుతున్న 10వ ఆంధ్రప్రదేశ్ స్టేట్ సీనియర్, జూనియర్ మెన్, వుమెన్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్–2023 పోటీలు ఆదివారం సాయంత్రంతో ముగిశాయి. శని, ఆదివారాల్లో జరిగిన ఈ పోటీల్లో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి మెన్ పవర్ లిఫ్టర్లు 150 మంది, వుమెన్ పవర్ లిఫ్టర్లు 70 మంది మొత్తం 220 మంది పోటీల్లో తలపడ్డారు. వారు పలు కేటగిరీల్లో బరువులు ఎత్తి తమ సత్తా చాటారు. ప్రతిభ కనబరిచి స్వర్ణ, రజత, కాంస్య పతకాలు సాధించారు. జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్, అమలాపురం హెల్త్ అండ్ ఫిట్‌నెస్ జిమ్, స్పోర్ట్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలకు సంబంధించి రెండో రోజు కార్యక్రమానికి ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, విశ్రాంత ఐపీఎస్ సుందర్‌కుమార్ దాస్ ముఖ్య అతిథులుగా పాల్గొని విజేతలకు పతకాలు అందించారు. బెంచ్ ప్రెస్, స్కాట్, డెడ్ లిఫ్ట్, మాస్టర్స్ కేటగిరీల్లో 47 కేజీల నుంచి 83 కేజీల బరువులు ఎత్తి సత్తా చాటారు. ఒక్కో పవర్ లిఫ్టర్ 90 కేజీల నుంచి 600 కేజీల వరకూ బరువులు ఎత్తి పతకాలు పట్టారు. పవర్ లిఫ్టింగ్‌లో 48, బెంచ్ ప్రెస్‌లో 24, డెడ్ లిఫ్ట్‌లో 24, మాస్టర్స్‌లో 24 ఇలా మొత్తం మూడు నాలుగు కేటగిరీలకు సంబంధించి 120 స్వర్ణ, రజత, కాంస్య పతకాలు విజేతలకు అందించారు. జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు యెనుముల కృష్ణ పద్మరాజు, కార్యదర్శి వంటిద్దు వెంకన్నాయుడు, అమలాపురం హెల్త్ అండ్ ఫిట్ నెస్ జిమ్, స్పోర్ట్స్ క్లబ్ కోచ్ డాక్టర్ కంకిపాటి వెంకటేశ్వరరావు, ఏపీ పవర్ లిఫ్టింగ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్.కోటేశ్వరరావు, చాంపియన్ షిప్ డైరెక్టర్ మట్టపర్తి వి.సముద్రం ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, పార్టీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, పార్టీ పట్టణ అధ్యక్షుడు సంసాని బులినాని బహుమతులు అందజేశారు.



ఓవరాల్ చాంపియన్ షిప్ సాధించిన అనకాపల్లి క్రీడాకారులకు ట్రోఫీ అందజేస్తున్న ఎమ్మెల్సీగా ఎన్నికైన సూర్యనారాయణ



పోటీల్లో బరువు ఎత్తుతున్న ఓ పవర్ లిఫ్టర్

స్ట్రాంగ్ వుమన్‌గా నిలిచాను



అమలాపురంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని పలు కేటగిరీల్లో మొత్తం 485 కిలోల బరువులు ఎత్తాను. పోటీల్లో అత్యంత ప్రతిభ చాటినందుకు నన్ను స్ట్రాంగ్ వుమన్‌గా ప్రకటించారు. ఇప్పటి వరకూ నేను 31 పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొన్నాను. బంగారు పతకాన్ని కూడా సాధించాను.

– దొండా కుసుమ, పవర్ లిఫ్టర్, అనకాపల్లి జిల్లా

కోనసీమ ప్రత్యేకతను చాటారు



ఇక్కడ రాష్ట్ర స్థాయి పోటీలకు వచ్చిన పవర్ లిఫ్టర్లకు కోనసీమ ప్రత్యేకతను చాటేలా వసతి, ఆహారం అందించి గౌరవంగా చూసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన 220 మంది పవర్ లిఫ్టర్లను ఓ క్రీడాకారులుగా కాకుండా ఓ అతిథులుగా గౌరవించారు. జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్‌కు మా క్రీడాకారుల తరపున కృతజ్ఞతలు. – కె.నరసింహరావు, పవర్ లిఫ్టర్, గుంటూరు జిల్లా

వాడపల్లి వెంకన్నకు భక్తుల విరాళాలు



దాతకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ సిబ్బంది

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామికి పలువురు భక్తులు విరాళాలు అందించినట్టు ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఆలయ ఈవో ముదునూరి సత్యనారాయణరాజు ఆదివారం తెలిపారు. పాలకోడేరు మండలం గొల్లకోడేరుకు చెందిన గాదిరాజు వెంకటరాజు రూ.50 వేలు, అనపర్తికి చెందిన కోటపల్లి వెంకటరావు రూ.50 వేలు, యానాంకు చెందిన ఇ.ఫణీంద్ర సత్యసాయి హేమంత్ పర్వేశ్ రూ.20,001, హైదరాబాద్‌కు చెందిన జి.వేణుగోపాల్, ఉమాదేవి రూ.10,116 విరాళం అందించినట్లు తెలిపారు. దాతలకు స్వామివారి చిత్రపటం అందించారు.

చెట్టుపై నుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

కపిలేశ్వరపురం: మాచర గ్రామానికి చెందిన గీత కార్మికుడు పిల్లి సూరిబాబు కల్లు గీస్తుండగా చెట్టుపై నుంచి జారిపడి గాయాల పాలయ్యాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం... సూరిబాబు శనివారం సాయంత్రం గోదావరి లంకలో కల్లు గీసేందుకు చెట్టు ఎక్కాడు. జారిపడటంతో వెన్నుకు గాయమైందని, కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్టు కుటుంబ సభ్యులు ఆదివారం తెలిపారు.

క్రైం కార్నర్..

యువకుడి అదృశ్యం



ప్రేమ్‌కుమార్

మండపేట: మతిస్థిమితం లేని యువకుడి అదృశ్యంపై ఆదివారం రాత్రి పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. కాజులూరు మండలం దుగ్గుదూరుకు చెందిన కోళ్ల ప్రేమ్‌కుమార్ ఈనెల 9వ తేదీన మండపేటలో బంధువుల ఇంటికి వచ్చాడు. సాయంత్రం ఇంటి వద్ద నుంచి స్వగ్రామానికి బయలుదేరాడు. మూడు రోజులైనా ఇంటికి తిరిగిరాకపోవడంపై తండ్రి ఇజ్రాయేల్ ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్ఐ కె.అప్పారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాగి వైరు దొంగల అరెస్టు

అనపర్తి: రాగివైరు చోరీలకు పాల్పడుతున్న ముగ్గురిని అనపర్తి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 41 కేజీల రాగివైరును స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నియోజకవర్గంలోని అనపర్తి, రంగంపేట, బిక్కవోలు పోలీస్ స్టేషన్ల పరిధిలో రాగి వైరు చోరీలకు పాల్పడుతున్న ఘటనలపై అందిన ఫిర్యాదులు మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఆదివారం అనపర్తి సీఐ వి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎస్ఐ పి. అప్పారావు కెనాల్ రోడ్డులోని అయ్యప్పస్వామి గుడి సమీపంలో బిక్కవోలు మండలం కాపవరానికి చెందిన వరసల నాగరాజు, ఆలమూరు మండలం జొన్నాడకు చెందిన కర్రి శ్రీనివాసరెడ్డి, రాయవరం మండలం మాచవరానికి చెందిన పడాల రాజారెడ్డిలను అరెస్టుచేసి వారి వద్ద నుంచి రాగివైరును స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించారు. నిందితుల నుంచి చోరీ సొత్తు కొనుగోలు చేసిన బిక్కవోలుకు చెందిన ఇద్దరు, అనపర్తికి చెందిన ఒక వ్యాపారిపై కేసులు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కొత్తపల్లి: ఉప్పాడ–కోనపాపపేట బీచ్‌రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయని ఆదివారం పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. మూలపేట ప్రకాష్ నగర్‌కు చెందిన వై.రాంబాబు, ఓసుపల్లి చిన్నతో పాటు మరి కొంత మంది శనివారం రాత్రి సుముద్రంపై వేటకు వెళ్లేందుకు సామగ్రితో ఆటోలో ఉప్పాడ–కోనపాపపేట బీచ్‌రోడ్డులో కాకినాడ వైపు వెళుతుండగా రామన్నపాలెం సమీపంలోని బీచ్‌రోడ్డులో వెనుక నుంచి వస్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో వెనుక కూర్చొన్న రాంబాబు, చిన్నాలకు గాయాలు కాగా చికిత్స కోసం వారిని పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీనిపై ఎస్సై రామలింగేశ్వరావు కేసు నమోదు చేసి దర్యప్తు చేస్తున్నట్టు తెలిపారు.

వైద్యులే కనిపించే దేవుళ్లు

- ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా

రాజానగరం: సమాజంలో రుగ్మతలతో సతమతమయ్యే వారికి భయం లేదనే భరోసానందిస్తూ ఆత్మస్థైర్యాన్నందించే వైద్యులే కనిపించే దేవుళ్లని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. స్థానిక జీఎస్ఎల్ వైద్య కళాశాలలో ఆదివారం జరిగిన స్నాతకోత్సవంలో 2017 బ్యాచ్‌కి చెందిన వైద్య విద్యార్థులకు డిగ్రీ పట్టాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. సభలో ఆయన మాట్లాడుతూ తాను కూడా ఇదే కళాశాల నుంచి మెడిసిన్ చేయవలసి ఉందని, కానీ కుటుంబ పరిస్థితులు, వ్యక్తిగత కారణాలతో పూర్తి చేయలేకపోయాననే బాధ ఇటువంటి సమయాలలో కలుగుతుందన్నారు. అయితే ఈ రోజు మెడిసిన్ పూర్తి చేసిన విద్యార్థులకు ఈ విధంగా డిగ్రీ పట్టాలు అందించే అవకాశం లభించడం జీవితంలో మరువలేని మధురమైన ఘట్టంగా నిలిచిపోతుందన్నారు. మానవ సేవయే మాధవ సేవ అనే పదానికి నిజమైన అర్థం ఇచ్చే వృత్తి.. వైద్యం అని, ఆ వృత్తిని చేపట్టిన మీరంతా అంకిత భావంతో పనిచేస్తూ, మానవుల్లో మాధవుల్లా సేవలందించాలన్నారు. కోవిడ్ వైరస్ సమయంలో వైద్యులు అందించిన సేవలు అనిర్వచనీయమైనవన్నారు.

లక్ష్య సాధనే అసలైన విజయం

నిర్ణయించుకున్న లక్ష్యాలను సాధించడం, సొంత గమ్యాలకు చేరుకోవడం మీద దృష్టినిపెట్టి చేరుకోవడమే అసలైన విజయమని అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు, పద్మభూషణ్ పుల్లెల గోపీచంద్ అన్నారు. వైద్య విద్యలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు గోపీచంద్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. అనంతరం జీఎస్ఎల్ వైద్య కళాశాల క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన బ్యాడ్మింటన్ ఇండోర్, మల్టీపర్పస్ ఆడిటోరియంలను ఆయన ప్రారంభించారు. కాలేజీలో 15వ బ్యాచ్ (2017)లో 196 మంది ఎంబీబీఎస్ పరీక్షలు రాయగా వారిలో 71 మంది ఫస్ట్ క్లాస్‌లో ఉత్తీర్ణులయ్యారని ప్రిన్సిపాల్ డాక్టర్ బీఎస్ గురునాథ్ తెలిపారు. కార్యక్రమంలో జీఎస్ఎల్ వైద్య కళాశాల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు, కార్డియోథొరాసిక్ సర్జన్ (బెంగళూరు) డాక్టర్ ధన్యప్రకాష్, సినీ నటుడు వి.నాగినీడు పాల్గొన్నారు.



మల్టీపర్పస్ ఆడిటోరియంలను ప్రారంభిస్తున్న గోపీచంద్. చిత్రంలో ఎమ్మెల్యే రాజా తదితరులు

ఉత్సాహంగా ఎడ్ల పరుగు పందేలు

- రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్న 37 జతల ఎడ్లు

పిఠాపురం: సువ్వా నేనా అంటూ గెలుపే లక్ష్యంగా ఎడ్ల బండ్లు దూసుకు పోతుంటే.. పరుగో పరుగు అంటూ రైతుల నినాదాల మధ్య గొల్లప్రోలు మండలం కొడవలిలో ఆదివారం రాష్ట్ర స్థాయి ఎడ్ల పరుగు పందేలు ఉత్కంఠ భరితంగా జరిగాయి. గ్రామ దేవత ఇందేశమ్మ జాతర సందర్భంగా స్థానిక ఎడ్ల బండ్ల సంఘం ఆధ్వర్యంలో రైతుల సహకారంతో నిర్వహించిన ఈ పోటీల్లో సీనియర్, జూనియర్ విభాగాల్లో 37 జతల ఎడ్లు పాల్గొన్నాయి. సీనియర్స్ విభాగంలో మొదటి, ద్వితీయ బహుమతులు గుమ్మిలేరుకు చెందిన కోరా శృతి చౌదరి, మూడో బహుమతి సామర్లకోటకు చెందిన వల్లూరి సత్యేంద్రకుమార్‌కు చెందిన ఎడ్ల జతలు గెలుచుకున్నాయి. జూనియర్స్ విభాగంలో మొదటి బహుమతి పిఠాపురం మండలం వెల్దుర్తికి చెందిన మొగలి ఏసుబాబు, రెండో బహుమతి వన్నెపూడికి చెందిన బవిరిశెట్టి మణి, మూడో బహుమతి ధర్మవరానికి చెందిన దొడ్డిపట్ల రామ గీతికా లక్ష్మణ గోకుల, నాలుగో బహుమతి జమ్మిగొల్లేపల్లికి చెందిన నలజాల నరసింహారావు మెమోరియల్‌కు చెందిన ఎడ్ల జతలు గెలుచుకున్నాయి. పోటీల్లో గెలుపొందిన వారికి ఎమ్మెల్యే పెండెం దొరబాబులు బహుమతులు అందజేశారు. పోటీలను కాకినాడ జిల్లాతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన రైతులు ఉత్సాహంగా తిలకించారు. జెడ్పీటీసీ సభ్యుడు వులవకాయల నాగ లోవరాజు, సర్పంచ్ బుర్రా రామచంద్ర, ఎంపీటీసీ సభ్యుడు భగవాన్, మాజీ సర్పంచ్ ముప్పనబోయిన సోమరాజు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అరిగెల రామయ్యదొర, కడింశెట్టి భాస్కరరెడ్డి పాల్గొనగా న్యాయ నిర్ణేతలుగా సిద్ధా నానాజీ, యనమల కృష్ణ, చేకూరి రామకృష్ణ వ్యవహరించారు.



గెలుపు కోసం పరుగు తీస్తున్న ఎడ్ల బండి



బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు